www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023

5

ఏలూరు



గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.బాలాజీ (48) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన బాలాజీ ఎనిమిదేళ్లుగా టి.నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. మరో రెండు రోజుల్లో బదిలీపై బుట్టాయగూడెం వెళ్లాల్సి ఉంది. ఈ తరుణంలో సోమవారం రాత్రి భోజనం చేశాక ఛాతిలో నొప్పి రావడంతో పోలీసులు ఆతన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు.

నిర్వాసితుల సమస్యలపై మమ..!

సిఎం 'పోలవరం' సమీక్షా సమావేశమంతా ప్రాజెక్టు పనులపైనే

సర్వం కోల్పోయిన నిర్వాసితుల గోడు పట్టని పరిస్థితి

పరిహారం చెల్లింపుపై స్పష్టత కరువు

మూడు గంటల పాటు సాగిన సిఎం పర్యటన

మీడియాపై తీవ్ర ఆంక్షలు



స్పిల్ వ్యూ నుంచి పోలవరంప్రాజెక్టును పరిశీలిస్తున్న జగన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఇచ్చిన ప్రాధాన్యత.. సర్వం కోల్పోయి తమ బతుకులను త్యాగం చేస్తున్న నిర్వాసితుల పట్ల లేని పరిస్థితి నెలకొంది. మంగళవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్వాసితుల సమస్యలపై సరైన స్పష్టత ఇవ్వకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ముందు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించిన సిఎం ఉదయం 10.05 గంటలకు పోలవరం హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఎంకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. దాదాపు మూడుగంటల పాటు ఆయన పర్యటన సాగింది. తొలుత వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టును సిఎం పరిశీలించారు. అనంతరం రోడ్డుమార్గాన వెళ్లి ఎగువ, దిగువ కాఫర్‌డ్యాం, దెబ్బతిన్న డయాఫ్రం వాల్ పనుల తీరును పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనుల పరిశీలన తర్వాత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనేక అంశాలను చర్చించారు. గైడ్‌వాల్ సమస్యపైన, దెబ్బతిన్న డయా ఫ్రంవాల్ పనులపైన, స్పిల్‌వే, అప్రోచ్ పనులు, ఇసిఆర్‌ఎఫ్ దెబ్బతిన్న గ్యాప్ పనులు వంటి అనేక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. నిర్వాసితుల సమస్యలపై మాత్రం చర్చ తూతూమంత్రంగా సాగినట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం నిర్వాసితులను తరలించాలని, పునరావాస కాలనీల్లో సామాజిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్న అంశాలకే పరిమితమైన పరిస్థితి నెలకొంది. గత ఏడాది జులై, ఆగస్టులో విరుచుకుపడిన వరదలకు నిర్వాసితుల పరిస్థితి దయనీయంగా మారింది. నెలల తరబడి పునరావాస కాలనీల్లోనే తలదాచుకున్నారు. ఇల్లుకట్టుకోలేక ఇప్పటికీ కొన్ని కుటుంబాలు పునరావాస కాలనీల్లోనే నివాసం ఉంటున్నారు. మళ్లీ జులై వచ్చేస్తోంది. వరదలు విరుచుకుపడే ప్రమాదం ఉంది. 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసిత కుటుంబాలకు 2022 సెప్టెంబర్ నాటికి పరిహారం అందిస్తామని అప్పట్లో సిఎం ప్రకటించారు. ఇప్పటికీ 30 శాతం మందికి కూడా పరిహారం అందలేదు. మిగిలిన కుటుంబాలకు పరిహారం ఎప్పట్లోగా పరిహారం అందిస్తారో సిఎం జరిపిన సమీక్షా సమావేశంలో స్పష్టత ఇవ్వలేదు. పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షల పెంపు, 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల పరిహారం ఇస్తామని ఇచ్చిన హామీల గురించి మాట్లాడిన పరిస్థితి లేదు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, భూమికి భూమి వంటి అనేక సమస్యలు అలానే ఉన్నాయి. ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలంటూ ఆదేశాలు ఇవ్వడం తప్ప నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారంపై మాత్రం కనీస చర్చకూడా లేదు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిమిత్తం రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు అమోదం తెలిపినట్లు సమీక్షా సమావేశంలో అధికారులు సిఎంకు తెలిపారు. ఈ సొమ్మును నిర్వాసితుల సమస్యలకు ఉపయోగిస్తారా లేక నిర్వాసితులను గాలికొదిలేసి నిర్మాణ పనులకు మళ్లిస్తారా తెలియని పరిస్థితి నెలకొంది. సిఎం పర్యటనలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు అంబటి రాంబాబు, తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్, జి.మాధవి, మార్గాని భరత్, శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ , జయమంగళ వెంకట రమణ, షేక్ సాబ్జీ, వి.చిరంజీవి, అనంత ఉదయ భాస్కర్, శాసన సభ్యులు తెల్లం బాలరాజు, ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్, ఎంవి.ప్రతాప్ అప్పారావు, ఉన్నమట్ల ఎలిజా, కె.అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు, తలారి వెంకట్రావు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, స్థానిక ప్రజాప్రతినిధులు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న సిఎం జగన్

మీడియాపై ఆంక్షల కత్తి

గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ లేని విధంగా సిఎం పర్యటనల్లో జిల్లా అధికారులు తీవ్ర నిర్బంధాలు ప్రయోగిస్తున్నారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో జరిగిన సిఎం పర్యటనలో ప్రింట్ మీడియాకు ఒకే ఒక పాస్ జారీచేశారు. ఫొటోగ్రాఫర్‌కుగానీ, స్థానిక విలేకరులకుగానీ పాస్‌లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. పాస్‌లు తీసుకెళ్లిన మీడియా ప్రతినిధులను కూడా సిఎం పర్యటన వార్త కవరేజీ చేయకుండా ఒకచోట కూర్చోబెట్టారు. అడుగడుగునా పోలీసులు నిర్బంధం కొనసాగింది. సమీక్షా సమావేశం వివరాలు కూడా మీడియాకు చెప్పలేదు. ఎందుకు వచ్చారో.. ఎందుకు వెళ్లారో.. మీడియా ప్రతినిధులకే తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారశాఖ ఇచ్చిన వార్తనే రాసుకోవాలనే నిర్బంధం పెరిగిపోయిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని చెప్పొచ్చు. మీడియాపై నిర్బంధం రోజురోజుకు పెరుగుతున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిఎం పర్యటనలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది.

ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు అడ్డుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలను వెంటనే ఆపాలని, చెరువులు తవ్వుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరుపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని అనేక చోట్ల పొలాలను రొయ్యలు, చేపల చెరువులుగా ఏ విధమైన అనుమతులూ పొందకుండా తవ్వుతున్నారన్నారు. అక్రమంగా తవ్వుతున్న ఆక్వా చెరువుల వ్యవహారంలో జిల్లా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ప్రజాదర్బారులో ఫిర్యాదులు చేసినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ వ్యవహారమంతా స్థానిక రాజకీయ నాయకులు, భూస్వాముల ఆధ్వర్యంలోనే జరుగుతుందని విమర్శించారు. మండవల్లి మండలం కానుకొల్లు దళితపేట కాలనీని అనుకుని ఉన్న పొలాలను ఆక్వా చెరువులుగా మార్చడంతో చుట్టు పక్కల ఉన్న తాగునీటి బావులు పాడై పేదలు, దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పొలాల మీదుగా గెయిల్ గ్యాస్ పైప్ లైన్ ఉందని, అదిగాని పగిలితే గ్యాస్ లీకై పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలున్నాయన్నారు. కలిదిండి మండలంలోని ఎస్‌ఆర్‌పి అగ్రహారంలో తాగునీటి చెరువులను ఆనుకొని చేపల చెరువులు తవ్వుతుండటంతో తాగునీటి చెరువులు పూర్తిగా కాలుష్యం బారినపడి ప్రజలు రోగాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా జిల్లాలో విచ్చలవిడిగా పర్మిషన్లు లేకున్నా అధికార బలంతో, డబ్బు బలంతో అక్రమంగా ఆక్వా చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయని, వీటిపై జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని రవి డిమాండ్ చేశారు. ప్రజలు, ముఖ్యంగా పేదలు, దళితుల తాగునీరు, ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో జిల్లాలో ప్రజానీకాన్ని పెద్దఎత్తున సమీకరించి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఈ నెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు అరకులో జరగనున్న గిరిజన సంఘ ఎనిమిదో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని గిరిజన జిల్లా కమిటీ నాయకులు తెల్లం దుర్గారావు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర మహా సభ సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండలంలోని అంకన్నగూడెంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఈ నెల 7, 8, 9 తేదీల్లో అరకులో జరుగుతున్న రాష్ట్ర మహాసభకు మండలం నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అంతరించి పోతున్న ఆదివాసీ ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడం, ఆదివాసీల కళలు రేపటి ఆదివాసీ తరానికి వారసత్వాంగా అందించాలని మహాసభల్లో మూడు రోజుల పాటు ఆట, పాట, మాట కార్యక్రమం వివిధ జిల్లాల నుంచి కళాబృందాలు పాల్గొని నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలు ఆదివాసీ చట్టాలు, హక్కులు నిర్వీర్యం చేసేదానికోసం కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ వ్యతిరేక విధానాలు తిప్పికొట్టడం కోసం ఈ మహాసభలోచేసే తీర్మానాలు దోహద పడతాయాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అప్పారావు, సీతారామయ్య, కొండలరావు పాల్గొన్నారు.




నరసింహను హౌస్ అరెస్టు చేసిన పోలీస్ అధికారి

సిఎం పర్యటన నేపథ్యంలో

రైతు సంఘం నేత హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - పోలవరం

సిఎం జగన్ మంగళవారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వస్తున్న నేపథ్యంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహను నూజివీడు పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులపై నిర్బంధాలు ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. హౌస్ అరెస్టులతో పోరాటాలు ఆపలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలన్నారు. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



అప్పారావుకు చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

నూకాలమ్మ సన్నిధిలో జబర్దస్త్ అప్పారావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నూకాలమ్మ ఆలయాన్ని జబర్దస్త్ టివి షో ఫేమ్, సినీ నటుడు అప్పారావు సందర్శించారు. మంగళవారం శ్రీ సిద్ధిధాత్రి మూవీ క్రియేషన్స్ పతాకంపై జంగారెడ్డిగూడెంలో నిర్మిస్తున్న చిత్రంలో నటించడానికి వచ్చిన జబర్దస్త్ అప్పారావు నూకాలమ్మ ఆలయానికి వచ్చారని చిత్ర దర్శకులు ప్రసాదరాజు తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుతం 22 సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నానని చెప్పారు. ఆలయ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణతో కూడిన ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ వెంకటేశ్వరావు, అనన్య చిత్ర దర్శక, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

దళితులంటే వైసిపికి చిన్నచూపు

మాజీ మంత్రి పీతల సుజాత

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో దళిత మహిళలపై అఘాయిత్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, రక్షణ కల్పించాల్సిన అధికార పార్టీ నేతలే దళిత మహిళలను హత్య చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి పీతల సుజాత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం రావివారిపాలెంలో దళిత మహిళ హనుమాయమ్మను వైసిపి నేత ట్రాక్టర్‌తో తొక్కించి చంపడం దారుణమని తెలిపారు. హంతకుడైన వైసిపి నేత కొండలరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం ఏనుకువానిలంకలో దళితుల లంక భూములు బలవంతంగా లాక్కోవడం దుర్మార్గమన్నారు. లంక భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తూ ప్రమాద ఘంటికలుగా మారుస్తున్నారన్నారు. మట్టి తవ్వకాలను అడ్డుకున్న టిడిపి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. జగన్మోహన్‌రెడ్డికి దళితులు అంటే చిన్నచూపు అన్నారు.

పేదలపై విరిగిన లాఠీ

చించినాడలో పోలీసుల జులుం

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారని పెరుగులంక పేదలపై అమానుషం

ఎంఎల్‌ఎ నిమ్మల, సిపిఎం, టిడిపి నాయకులను నడిరోడ్డుపై ఈడ్చేశారు

అడ్డు వచ్చిన వారిపై లాఠీలతో పోలీసులు వీరంగం

పలువురికి తీవ్ర గాయాలు

ఎంఎల్‌ఎతో సహా సుమారు 50 మంది అరెస్ట్

రణరంగంగా మారిన చించినాడ



మహిళను ఈడ్చుకెళ్తున్న పోలీసులు




పేదలను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - యలమంచిలి/భీమవరం

మండలంలోని చించినాడ గ్రామం రణరంగంగా మారింది. ఈ పంచాయతీ పరిధిలోని పెరుగులంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన పేదలపై, నేతలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. టిడిపి, సిపిఎం నేతలతో పాటు మహిళలను కూడా పోలీసులు రోడ్డుపై ఈడ్చుకుంటూ లాక్కెళ్లి అరెస్టు చేశారు. అడ్డొచ్చిన దళితులపై, పేదలపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుతో పాటు సిపిఎం, ఐద్వా ముఖ్యనేతలు, మరో 50 మంది సిపిఎం, టిడిపి నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనలో సిపిఎం నాయకులు తెన్నేటి స్టాలిన్, శ్రీనివాస్ తలకు బలమైన గాయాలు కాగా మరికొంత మంది మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. అనేక ఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్న పెరుగులంకలో మట్టి తవ్వకాలను అడ్డుకున్నందుకు పేదలు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నారు. ఈ పోరాటానికి ఎంఎల్‌ఉ నిమ్మల రామానాయుడు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాత్రి సిపిఎం, టిడిపి నాయకులతో కలిసి పెరుగులంకలోనే బస చేసిన ఎంఎల్‌ఎ మంగళవారం ఉదయం లంకలోనే కాలకృత్యాలు తీర్చుకొని బయటకు వెళ్లి మళ్లీ కారులో లంకలోకి తిరిగి వస్తున్న సమయంలో హైవే నుండి లంకకు వెళ్లే రోడ్డుకు తిరుగుతున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పేదల భూముల్లో మట్టి అక్రమ తరలింపునకు పోలీసులు అడ్డుకోకుండా, రెవెన్యూ యంత్రాంగం ఉండాల్సిన చోట అసలు పోలీసులకు సంబంధం ఏముందని, మట్టిని అమ్ముకునే దొంగలకు పోలీసులు కాపలా కాయడం ఏమిటని ఎంఎల్‌ఎ పోలీసులను ప్రశ్నించడంతో సుమారు గంటపాటు పోలీసులకు ఎంఎల్‌ఎ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అప్పటికే ఎంఎల్‌ఎ కారును సుమారు 200 మంది పోలీసులు చుట్టుముట్టి నరసాపురం డిఎస్‌పి, పాలకొల్లు సీఐ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎను కారు నుండి పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి పోలీసు జీపు ఎక్కించుకుని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వందలాదిమంది పేదలు, సిపిఎం, టిడిపి, మహిళా సంఘం నాయకులు రోడ్డుకు అడ్డంగాపడుకుని పోలీసు జీపులను అడ్డగించే ప్రయత్నం చేశారు. దీంతో వారిపై పోలీసులు లాఠీలను ఝుళిపిస్తూ ఆగ్రహంతో ఊగిపోయారు. దొరికిన వారిని దొరికినట్లు మహిళలను సైతం రోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యాను, బస్సులలో ఎక్కించి అరెస్టు చేశారు. ఈ క్రమంలో సుమారు పదిమంది వరకూ మహిళలకు, పురుషులకు తీవ్ర గాయాలైనట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని ఎక్కడికి తీసుకెళ్లారో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో అరెస్ట్ అయిన వారి బంధువులు, మిత్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వాసుపత్రులకు తరలించారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ




ర్యాలీలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ మనుగడ, అభివృద్ధి పర్యావరణంతో ముడిపడి ఉందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఏలూరు పవర్‌పేటలోని వాసు దేవాలయం ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మానవజాతి సుఖంగా బతకాలంటే ప్రకృతి సమతుల్యత పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. వక్తగా పాల్గొన్న ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు విజిఎం కృష్ణారావు మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల కాలంలో ఆక్సిజన్ కొరత వచ్చిందని, చెట్లు నరకడం వంటి మానవ తప్పిదాల వల్ల ఆక్సిజన్ కొరత ఏర్పడుతుందని, కాబట్టి ప్రతిఒక్కరూ సామాజిక వనాలను పెంచాలని కోరారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్.కస్తూరిరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలు బాల వికాస్ భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్థ అధ్యక్షుడు ఎస్‌ఎన్.కట్టా ఆదర్శనీయులని కొనియాడారు. సభాధ్యక్షులు కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం మానవునిపై ఉందని తెలిపారు. సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు, మానవత సంస్థ నాయకులు ఎం.అజయ్‌బాబు, ఉపాధ్యాయులు ముస్తఫా అలీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణంతో మమేకం కావాలని, విద్యార్థులు ఇప్పటినుండే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుత విపత్కర వాతావరణ పరిస్థితులను గమనంలో ఉంచుకొని ముందుకు సాగాలని వారు తెలిపారు. సదస్సుకు ముందు ఏలూరు పవర్ పేట రైల్వే స్టేషన్ రోడ్డులో, వాసు దేవాలయం ప్రాంతంలోని ప్రధాన రహదారులో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు, బాలలకు, మహిళలకు పౌష్టికాహారం అందించారు.

వీరబాబుకు జాతీయస్థాయి ర్యాంకు



వీరబాబు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు సిఎంఎ విద్యార్థి కె.వీరబాబు జాతీయస్థాయిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌ఎమెంట్ అకౌంట్స్ నిర్వహించిన పరీక్షలో 46వ ర్యాంకు సాధించి మంగళవారం అందరి ప్రశంసలు పొందాడు. బృందావన్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్‌లో సిఎంఎ చదివిన విద్యార్థి కొలిశెట్టి వీరబాబును కళాశాల ఫౌండర్ రవికుమార్, డైరెక్టర్లు కొనకళ్ల మాధవరావు, కొనకళ్ల మణిదీప్, ప్రిన్సిపల్ వరప్రసాద్, రాణి మేకల అభినందించారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు 745 మంది హాజరు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ఐదు కేంద్రాల్లో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగుతున్నట్లు డివైఇఒ సేవ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం జరిగిన లెక్కల పరీక్షకు 860 మంది విద్యార్థులకు 745 మంది విద్యార్థులు హాజరు కాగా 115 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు మంచినీరు, ఎమర్జెన్సీ మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

పోలవరాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి

సిఎం జగన్‌కు వైసిపి మండల కన్వీనర్ మురళీకృష్ణ వినతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరాన్ని జిల్లాగా, జిల్లా కేంద్రంగా ప్రకటించాలని మంగళవారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రికి వినతి పత్రం అందించినట్లు వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బుగ్గ మురళీకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంగా ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన పోలవరం గ్రామానికి రెడ్డి పోలవరం అనే పేరు ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతూ ఉందన్నారు. నేటికీ ఉత్తర ప్రత్యుత్తరాల సందర్భాల్లో పోలవరం గ్రామాన్ని రెడ్డి పోలవరం గ్రామంగానే పేర్కొంటూ ఉంటారని, దేశంలో ఎక్కడికి వెళ్లినా రెడ్డి పోలవరం అంటేనే పోలవరం ప్రాజెక్టు ప్రాంతంగా గుర్తింపు ఉందని, రెడ్డి రాజులు పరిపాలించిన ప్రాంతం కావడంతో పోలవరం గ్రామాన్ని రెడ్డి పోలవరం గ్రామంగానే పరిగణిస్తూ, పిలుస్తూ వచ్చారన్నారు. రెడ్డి పోలవరం మండలానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఎంతో నష్టం వాటిల్లిందని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల, ప్రాజెక్టు ఎగువ గ్రామాల ప్రజలు ఇతర మండలాల్లో పునరావాసాలకు వెళ్లిపోవడంతో వర్తక, వాణిజ్య, వ్యాపారాలు నష్టపోయాయని, సాగులో ఉండే ఎన్నో భూములు కోల్పోయి రైతులు వ్యవసాయానికి దూరమయ్యారన్నారు. నెక్లెస్ బండ్ నిర్మాణం పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో పోలవరం గ్రామ ప్రజలు ఎంతో నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రజల జీవనాడిగా రాష్ట్రంలో ఎన్నో లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, సాగునీరు, తాగునీరు ప్రజలందరికీ అంది రాష్ట్రం సస్యశ్యామలమవుతుందనే మంచి ఆలోచనతో ప్రాజెక్టు నిర్మాణంతో మండల ప్రజలకు ఎన్ని కష్టనష్టాలు వచ్చినా భరిస్తూ వచ్చారన్నారు. ఇప్పుడు తాజాగా పోలవరాన్ని జిల్లాగా ప్రకటిస్తున్నారని, కొంతమేర సమాచారం అందిన నేపథ్యంలో పోలవరాన్ని జిల్లా కేంద్రంగా పరిగణించాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మహంకాళరావు

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళరావు కోరారు. మండలంలోని కోరుకొల్లు, కొచ్చర్ల, ఆవకూరు గ్రామాల్లోని పని ప్రదేశాల్లో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతేడాది రావాల్సిన వేతనాలు అందలేదని, ఏడాదిలో వంద రోజుల పని దినాలు కూడా పూర్తికావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోని డ్రెయినేజీ పనులను ఉపాధి పనుల్లో చేర్చి 200 రోజుల పని దినాలు చూపాలని, రూ.600 వేతనం ఇవ్వాలని, పని ప్రదేశాల్లో వైద్యసౌకర్యాలు కల్పించాలని, ఫొటోలు తీసే పద్ధతిని నిలుపుదల చేయాలని మహంకాళరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు పెనుమాల రమేష్, కె.లాజరు, పాము సుధాకర్, బి.నాగరాజు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

ప్రజాశక్తి - నిడమర్రు

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పోలవరం పర్యటన సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు పోలవరం వెళ్లకుండడని ముందస్తు హౌస్ అరెస్టును వారు ఖండించారు. ఈ మేరకు నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునర్ధరించాలని, కార్మిక సంక్షేమ పథకాలు అమలు, కార్మిక బోర్డు నిధులు సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని స్థానిక ప్రజాప్రతిని కోరామన్నారు. అవకాశం ఇవ్వకపోగా అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు గోశ సూరిబాబు, కంచం వరప్రసాద్, కోసూరి శివ, చిన్నమిల్లి రాంబాబు, దుసనపూడి పాండు, ఆశపు హరిప్రసాద్, కానూరు శ్రీను పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుల గృహనిర్బంధం

నూజివీడు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పోలవరం పర్యటనను పురస్కరించుకుని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహను నూజివీడు పోలీసులు మంగళవారం గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ప్రజా సంఘాలు పాలన వ్యవహారాలపై ముఖ్యమంత్రి ప్రజాసంఘాల నాయకులను ఎందుకు గృహనిర్బంధం చేయాల్సి వస్తుందని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న గంజిమాల దేవి

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బాల్య వివాహాలను సమిష్టి కృషితో అరికట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలు గంజిమల దేవి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి బాల్య వివాహాల నిర్మూలన అవగాహనా సదస్సులో చిల్డ్రన్ వెల్ఫేర్ రీజనల్ ఛైర్మన్ సాయిబాలపద్మతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని బాల్య వివాహ రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాల నిరోధానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. సిబ్బంది గ్రామాల్లో బాల్య వివాహాలు వాళ్ల కలిగే దుష్ఫలితలపై అవగాహన కల్పించాలన్నారు. అందుకు గాను గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్ కమిషనర్ రాజేంద్ర, చైల్డ్ రైట్ కో-ఆర్డినేటర్ స్నేహన్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తులసి, ఎంపిపి కోర్శ పోసమ్మ, జెడ్పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచి చీర్రి జగదాంబ, జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, మహిళ పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

నూతన జాతీయ రహదారిపై భీమడోలు మండలం కొండ్రెడ్డినగర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని బేతవోలు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు భవన నిర్మాణ కార్మికులైన పరిటాల రాజు, బండి సంజయ్, తెల్లం గౌతం ముగ్గురు స్నేహితులు. వీరి స్నేహితుని వివాహానికి బైక్‌పై రాజమండ్రి వెళ్లిన వీరు వివాహం పూర్తయిన అనంతరం బుధవారం తెల్లవారుజామున గుడివాడకు తిరిగి బైక్‌పై బయలుదేరారు. పరిటాల రాజు(20) బైక్ నడుపుతున్నారు. ఈ క్రమంలో నిద్రమత్తు కారణంగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరిటాల రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలపాలైన మరొ ఇద్దరు చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. భీమడోలు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని బాలిక దుర్మరణం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను-ఆగడాలలంక ఆర్ అండ్ బి రోడ్డుపై లక్ష్మీపురం వద్ద బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక బాలిక మృతి చెందింది. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకాతిరుమల మండలం శరభాపురం గ్రామానికి చెందిన దంపతులు చేపల చెరువుపై కాపలా కోసం మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి వలస వచ్చారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఎనిమిదేళ్ల వయస్సు గల వారి కుమార్తె ఐస్‌క్రీమ్ కొనుక్కునేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన బాలికను చికిత్స కోసం ఏలూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృత్యువాత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన నులకాని యుగంధర్ (28) రోజువారి మాదిరిగానే కోళ్ల ఫారంలో పనిచేయడానికి వెళ్లాడు. ఎండ తీవ్రతను తగ్గించే క్రమంలో కోళ్ల ఫారాల రేకులపై తాటాకులు పరిచేందుకు పైకి ఎక్కాడు. తాటాకులు పరుస్తుండగా పామాయిల్ చెట్టు ఆకుపై కాలు మోపాడు. కాలు జారి పడిన యుగంధర్ రెకులపై జారుతూ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.తండ్రి నులకాని సత్యనారయణతో పాటు పనులకెళ్తూ చేతికందివచ్చిన కుమారుడు అకాల మరణంతో కుటుంబం తీవ్ర శోకానికి గురైంది. పోస్టుమార్టం నిమిత్తం యుగంధర్ మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - మండవల్లి

తాళం వేసి ఉన్న ఆలయంలోకి దొంగలు చొరబడి నగదుతో పాటు హుండీ కూడా అపహరించుకుపోయిన సంఘటన మండల కేంద్రమైన మండవల్లి సాయిబాబా ఆలయంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి పామర్రు దిగమర్రు 165 వద్ద మండవల్లి శివారులో ఉన్న సాయిబాబా ఆలయంలో సోమవారం రాత్రి పూజా కార్యక్రమాలు ముగించుకుని పది గంటల సమయంలో గుడికి తాళం వేసి వచ్చేశారు. మంగళవారం ఉదయం గుడి తెరవడానికి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఇనుప మెస్ తలుపులు తెరచి ఉండడని గమనించి లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. గుడిలో ఉన్న హుండిని అపహరించుకుపోయినట్లు బాధితులు వివరించారు. ఇప్పటికీ సుమారు ఐదు సార్లు దొంగలు గుడిలో దొంగతనానికి పాల్పడ్డారని నిర్వాహకులు తెలుపుతున్నారు. దొంగలు గుడిలో చోరీకి పాల్పడినప్పుడల్లా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నామని వారు వివరించారు. ఇప్పుడు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మండుతున్న ఎండలు.. జనం బెంబేలు..!

ఫ్యాక్టరీల్లో తగ్గుతున్న కార్మికుల హాజరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రోహిణికార్తె ప్రభావంతో మండలంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపడంతో జనం అల్లాడుతున్నారు. మంగళవారం ముదినేపల్లిలో 43 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో పల్లె జనం హడలెత్తిపోయారు. పశుపక్ష్యాదులు అల్లాడుతున్నాయి. మండే ఎండలకు జనం ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తగిన రక్షణ జాగ్రత్తలు తీసుకొని వస్తున్నారు. మధ్యాహ్న వేళల్లో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. బస్టాండ్ ప్రయాణికుల లేక వెలవెలబోయింది. ఎండలకు దుకాణాలు 11 గంటలకే మూసివేశారు. ఎండలకు కారు గ్యారేజీల్లో పని చేసే మెకానిక్‌లు విధులకు రాకపోవడంతో మరమ్మతులకు గురైన తమ వాహనాలను రిపేరు చేసుంచుకునేందుకు వాహనదారులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. మండలంలోని చిగురుకోట, సింగరాయపాలెం, వణుదుర్రు తదితర గ్రామల్లో ఉన్న ఆక్వా ఫీడ్స్, ఆక్వా ప్రాసెస్సర్స్ , సెంటినీ, వంటి ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు తమ విధులకు గైర్హాజరు కావడంతో ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల హాజరు శాతం తక్కువగా ఉంటుంది. ఎండలకు భయపడి విధులకు కార్మికులు డుమ్మా కొట్టడంతో విధుల్లో ఉన్న మిగతా కార్మికులు డబల్ డ్యూటీ చేయాల్సి వస్తోంది. ఎండలకు జనం బయటకు రాకపోవడంతో బేరాలు తక్కువగా ఉంటునట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఉదయం పది గంటల లోపు, సాయంత్రం ఐదు గంటలు తర్వాత మాత్రమే జనం దుకాణాలకు వస్తున్నట్లు చెబుతున్నారు. ఎండలకు ప్రయాణాలు తగ్గి ఆటోలు ఎక్కే వారి సంఖ్య తక్కువగా ఉండడంతో ఆటోవాలాలు ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారి కీస్తిలు కట్టుకోవాడానికి ఆటో డ్రైవర్లకు కిరాయిలు, చిరు వ్యాపారులకు బేరాలు లేక అవస్థలు పడుతున్నారు. ఎండలకు తాపీ పనులు చేసే కార్మికులు జంకుతున్నారు. దీంతో తాపీ పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఎండలకు, ఉక్కపోతలకు తాపీ కార్మికులకు చెమటలు పట్టి శరీరంపై నీరుడు పొక్కులు వచ్చి దురదలు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తాపీ కార్మికులు చెబుతున్నారు. మండుతున్న ఎండలకు ఇక బిపి, షుగర్, దీర్ఘకాల వ్యాధిగ్రస్తుల అవస్థలు వర్ణానాతీతం. ఈ నెల 8వ తేదీ వరకు మరో రెండు రోజుల పాటు రోహిణికార్తె ఉండడంతో మండుతున్న అగ్ని సెగలకు మండల ప్రజలు అందోళన చెందుతున్నారు.



నిర్మానుష్యంగా రోడ్డు



వెలవెలబోతున్న బస్టాండ్

అతిసార వ్యాధిపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అతిసార వ్యాధిపై తల్లులు అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేస్తే బిడ్డలకు ప్రాణాపాయమని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు పేర్కొన్నారు. స్థానిక తంగెళ్లమూడి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య పరిధిలో ఉన్న యాదవ్ నగర్ సచివాలయంలో ఐడిసిఎఫ్ కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు సంభవించే నీళ్ల విరోచనాల(అతి సార)పై తల్లులకు అవగాహన కల్పించారు. అతి సార వ్యాధి వల్ల కొన్ని లక్షల మంది పిల్లలు చనిపోతున్నారన్నారు. తల్లుల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల పిల్లలకు సమయానికి వైద్య సదుపాయం లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నీళ్ల విరోచనాల వ్యాధి వల్ల శరీరంలో ఉండే నీరు విటమిన్స్, లవణాలు బయటికి పోవడం వల్ల బిడ్డ నీరసించి డిహైడ్రేషన్‌కు గురై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మన ఇంటి వద్ద లభించే ద్రవ పదార్థాలలైన మజ్జిగ, కొబ్బరి నీళు ,, మంచి నీటిలో చిటికెడు ఉప్పు చారెడు పంచదారతో హెచ్ఎఫ్ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒఆర్ఎస్ ద్రావణాన్ని పట్టించడం ద్వారా బిడ్డ ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం ఒఆర్ఎస్ కలిపే విధానాన్ని తల్లులకు వివరించి ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఎన్ఎం విజయ శ్యామల, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి ప్రమీల, అంగన్‌వాడీ టీచర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో జె.గోవిందరావు, సిబ్బంది

కొల్లేరు కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

సహజ సిద్ధ మంచినీటి వనరైన కొల్లేరు సరస్సు కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని స్వచ్ఛభారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ జితేంద్ర శ్రీ వాస్తవ కోరారు. రాష్ట్రంలో అమలవుతున్న స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాల పరిశీలనలో భాగంగా క్షేత్ర సందర్శన కోసం భీమడోలు మండలంలోని భీమడోలు, దుద్దేపూడి గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. తొలుత భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆయన భీమడోలు సర్పంచి సునీత మాన్‌సింగ్ తో గ్రామంలో అమలవుతున్న పారిశుధ్యయ పరిరక్షణ కార్యక్రమాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం, వెల్నెస్ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాల గురించి అడిగారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులను మండల పరిధిలో అమలవుతున్న గృహ నిర్మాణాలు వాటికి అనుబంధంగా మరుగుదొడ్ల ఏర్పాట్లు గురించి అడిగారు. అనంతరం భీమడోలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి చేరుకున్న ఆయన వివిధ విభాగాలను సందర్శించారు. అంశాల వారీగా కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఆ తరువాత స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాల అమలుపై గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తలు వేర్వేరుగా సేకరించేందుకు పంపిణీ చేసిన తొట్టెల గురించి ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమడోలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు బాగుందన్నారు. కొల్లేరు సరస్సు కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఎండి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చీఫ్ ఇంజినీర్ జె.వెంకటమురళిని కోరామన్నారు. ఈ మేరకు స్పందించిన ఎండి కొల్లేరు సరస్సు కాలుష్యం బారిన పడకుండా చూసేందుకు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి శుద్ధ జలాలను సరస్సులోనికి తరలించే ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఇడి ఊర్మిళాదేవి, పలువురు జిల్లా స్థాయి అధికారులతో పాటు భీమడోలు జెడ్పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, ఎంపిపి కనుమాల రామయ్య పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సర్టిపై చేస్తున్న జితేంద్ర

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా మలేరియా అధికారి టిఎస్ఎస్వి.ప్రసాద్ ఆధ్వర్యంలో దిగువల్లి పిహెచ్‌సిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి దిగువల్లి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎలమంద, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి


మండలంలోని సోమవరం గ్రామంలో గ్రామ సర్పంచి కక్ష సాధింపు కారణంగా పంచాయతీ పెట్టి తప్పు విధించి అవమానపరచడంతో మనస్తాపానికి గురైన కలవల శ్రీనివాసరావు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని, అతని కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం, కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి కొమ్ము ఆనందం కోరారు. ఈ మేరకు వారి తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. శ్రీనివాసరావు కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక సభ్యులు ఇవి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి ప్రభుత్వం పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు విమర్శించారు. మహానాడులో ప్రకటించిన టిడిపి మేనిపేస్టోకు మద్దతుగా మంగళవారం మండలంలోని తిరుమలదేవిపేటలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మహిళలు చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శీలం వెంకటేశ్వరావు మాట్లాడుతూ రైతులే రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు అన్యాయం జరిగిందని, కనీసం రైతులకు డ్రిప్, స్పింక్లర్లు ఇవ్వడం లేదన్నారు. బోర్లు కూడా వేయడంలేదన్నారు. అన్నివర్గాల పేదలకు అవసరమైన పథకాలు ఆలోచించి మహానాడులో చంద్ర బాబు మేనిపేస్టో విడుదల చేశారన్నారు. జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కొంతమందికి డబ్బులు వేసినట్లు వేసి పెంచిన ధరలతో మళ్లీ లాగేస్తున్నారని విమర్శించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. టిడిపి హయాంలో 72 శాతం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మిగిలిన 28 శాతంలో పది శాతం కూడా పూర్తి చేయాలేకపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కి ఓటు వేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసిరెడ్డి రామ్మోహన్, పినపాక సాయి, కలిశెట్టి పార్థసారధి, గండబోయిన శ్రీను, కాల్నీడి రాంబాబు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీపై విచారణ



మాధవకు ప్రతిపాదనల గురించి వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ముదినేపల్లి

స్పందన అర్జీపై మంగళవారం జిల్లాస్థాయి అధికారులు విచారణ చేశారు. మండలంలోని వణుదుర్రు దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చిన్నం మాధవ తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో, ఎంఎల్‌ఎ డిఎన్ఆర్‌కు, తహశీల్దార్ కె.శ్రీనివాస్‌కు గ్రామ దళితవాడలో ప్రజలు ఎదుర్కొంటున పలు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. గ్రామ పంచాయతీకి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళారు. ఈ అర్జీలపై స్పందించిన సదరు జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ జి.చంద్రాభాస్కర్‌రెడ్డి దళితవాడలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు మాధవకు వివరించారు. పంపిన ప్రతిపాదనలు అమోదం కాగానే గ్రామంలో రోడ్లు, తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆయనతో పాటు పిఆర్‌డిఇ సురేష్, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు చంద్ర రాజేశ్వరరావు

పలుచోట్ల ఘనంగా జయంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావు జయంతి కార్యక్రమం ఆర్‌ఆర్‌పేట, స్ఫూర్తి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు మంగళాపురం అనే ఒక చిన్న కుగ్రామంలో పుట్టి, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా అనేక దేశాల్లో పర్యటించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని అవగాహన చేసుకున్న మహోన్నత నేత అని కొనియాడారు. సోవియట్ యూనియన్ లో ప్రతిష్టాత్మకమైన అవార్డు ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డును తీసుకున్న గొప్ప ఉద్యమకారుడు చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన తరువాత రాష్ట్రానికే పరిమితమైన వ్యవసాయ కార్మిక సంఘాన్ని 1968వ సంవత్సరం దేశ స్థాయిలో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్‌గా నిర్మించారన్నారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసే ప్రతిఒక్కరికి చంద్ర రాజేశ్వరరావు జీవితం ఆదర్శనీయమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ, సిపిఐ నాయకులు నాగం అచ్యుత్, యర్రా వెంకటేశ్వరరావు, గొర్లి స్వాతి, బెతా శంకర్ పాల్గొన్నారు.

చింతలపూడి : చంద్ర రాజేశ్వరరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్రంలో ఉన్న మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు జయంతి స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. చల్లపల్లి భూ పోరాటాన్ని నడిపి వేలాది ఎకరాలు పేదలకు దక్కడంలో ఆయన పోరాట స్ఫూర్తి మరువలేనిదన్నారు. ఆయన సొంత భూమిని కూడా పేదలకు పంచిన ఘనత ఆయనదేన్నారు. విద్యార్థి సంఘంలో నుంచే ఆయన ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్మించడంలో దిట్ట అన్నారు. చింతలపూడి ప్రాంతంలో కూడా ప్రత్యక్షంగా భూపోరాటంలో పాల్గొన్న వ్యక్తి రాజేశ్వరరావు అని చెప్పారు. రాజేశ్వరరావు ఉద్యమ స్ఫూర్తితో ఈ మతోన్మాద శక్తులపై పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత రాజేశ్వరరావు చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోడ వజ్రం పూలమాలతో నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్లూరు సోమశేఖర్ ఆచార్యులు, మండల కమిటీ సభ్యులు దంతా కృష్ణ, ఎం.లాజరు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి తొర్లపాటి రాజు, మెంతిని జోత్స్న, సౌజన్య పాల్గొన్నారు.

ముసునూరు : పేదలకు ఆరాధ్య దైవం చంద్ర రాజేశ్వరరావు అని ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని గుడిపాడు గ్రామంలో రాజేశ్వరరావు జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుడిపాడు గ్రామ సర్పంచి రాజు బోయిన శ్రీదేవి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అటవీ భూములు పేదలకు పంచి పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నాణ్యత ప్రశ్నార్థకమే : సిపిఎం

ప్రజాశక్తి - పోలవరం

ప్రాజెక్ట్ నిర్మాణ నాణ్యత ప్రమాణాల విషయంలో లోటుపాట్లు కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం అన్నారు. సిపిఎం పోలవరం మండల కమిటీ సమావేశం చేగొండపల్లి గ్రామంలో తామా బాలరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించినట్లు పార్టీ మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.జీవరత్నం మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణ నాణ్యత ప్రమాణాల విషయంలో లోటుపాట్లు కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయని, ఇటీవల కాలంలో కాంక్రీట్ మిక్సర్ నిలబెట్టిన చిన్న కట్టడం నేలలో కూలిపోయిందని, తర్వాత కాలంలో ప్రధాన గేట్ల భాగం డ్యామేజ్ అయిందని, వరదలకు డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని, ఇప్పుడు గేట్ బాండ్ కుంగిపోయిందన్నారు. ఈ విధంగా చూస్తే రానున్న రోజుల్లో పోలవరం ప్రాజెక్టు ప్రొఫెసర్ శివాజీరావు చెప్పిన విధంగా ప్రమాదం తప్పదా అనే విధంగా ఉన్నాయన్నారు, పార్టీ మండల కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ విషయంలో నిర్వాసితులకు బిజెపి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష, అధికార పక్షాలు నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకుండా, ప్రాజెక్టు పట్టించుకోకుండా ఓట్లు, సీట్ల కోసమే చూస్తున్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20వ తేదీ నుంచి చలో అమరావతి నిర్వాసితుల పోరు కేక పేరుతో నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరెంజ్ ఎలెర్ట్ జారీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మంగళవారం, బుధవారం వడగాలులు వీస్తాయని ఎపి విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. నూజివీడు మండలంలో 43, ఆగిరిపల్లిలో 43.4 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదవుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు వడగాలులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు నిర్వహణ సంస్థ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

అందరూ విధిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - మండవల్లి

పర్యావరణంలో చోటు చేసుకుంటున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలను నాటడం విధిగా అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ సుధాబత్ర విజయకుమార్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుధామ ఫౌండేషన్ ఐక్యవేదిక ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సింధూరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలు కాలుష్యం బారి నుంచి రక్షించడం కోసం తప్పనిసరిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఒక్కొక్క మొక్కను నాటి సంరక్షిస్తే దేశం సస్యశ్యామలంగా మారిపోతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటడం విధిగా అలవాటు చేసుకోవాలన్నారు. మొక్కల నుంచి విడుదలయ్యే ఆక్సిజన్ స్వచ్ఛమైన గాలి వాతావరణాన్ని ఆహ్లాద పరుస్తుందన్నారు. పొలం గట్ల మీద, విద్యాసంస్థల్లో, పరిశ్రమల ప్రాంగణాల్లో, రైల్వే ట్రాక్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం మొక్కలను నాటి వాటిని సంరక్షించే విధంగా గార్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, పి.అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పడిపోయినవి

ఏలూరు జిల్లా, కొమడవోలు, ఏలూరు గ్రామ కాపురస్తులు అయిన గులిపల్లి రాఘవమ్మ, W/o. రంగారావు అను నాకు SRO, భీమడోలు డాక్యుమెంట్సు నెంబర్స్ 4347/2017 అను డాక్యుమెంట్స్ పట్టుకొని గుండుగొలను వెళ్ళుటకు బస్సు ఎక్కుతుండగా డాక్యుమెంట్సు ఉన్న కవరు పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఈ దస్తావేజులు (ఆస్తి పత్రాలు) దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియచేయవలసిందిగా కోరుచున్నాము.

గులిపల్లి రాఘవమ్మ
భర్త: రంగారావు
కొమడవోలు, ఏలూరు
సెల్: 9010841535

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారు, తాడేపల్లిగూడెం
ఒ.ఎస్. నెం. 146/2019

మధ్య:
వాది: శ్రీ రావిళ్ళ వెంకటరత్నం
మరియు
ప్రతివాది: షేక్ మీరావలి

పబ్లిక్ నోటీసు
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేర

యిందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా, మీరు మీ అవసర నిమిత్తం పైవారల వద్ద అప్పు తీసుకొని వారికి ఒక ప్రామిసరీ నోటును వ్రాయించి యిచ్చినారనియు తదుపరి మీ నుండి సదరు పైకము వడ్డీతో రాబట్టుకొనుటకు నా క్లయింటు పెక్కు పర్యాయములు ప్రయత్నం చేసినను ఫలితం శూన్యమైనది. చేయునది లేక నా క్లయింటు పిటీషను దాఖలు కావించగా సదరు కోర్టు వారు సదరు నోటీసు పేపరు ద్వారా పంపమని తెల్పియున్నారు. మీపై వేసిన దావా **ది. 14-06-2023**న మీ రాకకై వేసియున్నారు. కావున పై తేదీన మీరు ఖుద్దున గాని, విషయ పరిజ్ఞానము గల వకీలు ద్వారా కాని ఆరోజు **10.30 ని॥లకు** వచ్చి తగు వకాల్త వేసి కౌంటరు స్టేటుమెంటులను వేయించగలరు. అట్లు కాని పక్షాన సదరు దావా మీ పరిముఖము లేకనే తీర్పు కావించబడునని యిందుమూలముగా తెలియచేయుచున్నాము.

యాళ్లబండి రామకృష్ణ పరమహంస
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9948169761
తేది: 06-06-23 6303018736